epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 249 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 18, మే 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

# అద్భుతాల ఒడిలో.. అందాల సడి

- ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీలో 108 దేశాల సుందరాంగుల సందడి
- పర్యాటక ప్రదేశాలను వీక్షిస్తూ మైమరచిన ముద్దుగుమ్మలు
- బాహుబలి సెట్‌లో అచ్చెరువొందిన అందాల భామలు

**మే 17, సమయం న్యూస్, హైదరాబాద్:** రెండు అబ్బురాలు.. ఒక్కచోట కలిసినట్టు.. చుక్కలన్నీ ఒక్కసారే నేలకు దిగితే.. ఆకాశం..సముద్రం ఒక్కచోట కలిస్తే.. సందె వేళ సూరీడు..భూమిని ముద్దాడితే.. ఆ ఊహే ఎంతో అపు'రూపం'గా ఉంటుంది.. ఆ ఊహ దృశ్యమైతే ఇంకెంతో అద్భుతంగా ఉంటుంది.. అలాంటి రెండు అద్భుతాలు ఒక్కచోటే జతచేరితే మహాద్భుతమే కదూ!

అచ్చంగా అలాంటి అనుభూతుల సంగమానికి శనివారం రామోజీ ఫిల్మ్ సిటీ వేదికయింది. ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడుతున్న 108 దేశాల సుందరీమణులు సాయంత్రం సమయంలో సుమారు నాలుగున్నర గంటల పాటు ప్రపంచ ప్రఖ్యాత సినీ లోకంలో సందడి చేశారు. ప్రధాన ద్వారం సైనేజ్‌బోర్డు నుంచి వారి ప్రయాణం ఆరంభమైంది. సితార, తార, ఏంజిల్‌ఫౌంటెయిన్, హవామహల్, నర్తకి గార్డెన్, మొఘల్‌గార్డెన్, బాహుబలి సెట్ తదితర పర్యాటక అబ్బురాలను వీక్షించిన ముద్దుగుమ్మలు ముగ్ధులయ్యారు. రాత్రి విద్యుత్ కాంతుల మధ్య సినీ ప్రపంచం అందచందాలను వీక్షిస్తూ తన్మయం చెందారు.

చల్లని సాయం సంధ్య వేళ ప్రపంచ ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రాంగణం వివిధ దేశాల

తరువాయి 2లో




# ప్రపంచ తొలి 'ఏఐ డాక్టర్!'

- సౌదీలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి

**మే 17, సమయం న్యూస్, ఢిల్లీ:** కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్.. ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలో ప్రారంభమైంది. చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్నీ ఏఐతో

తరువాయి 2లో



## ఏపీలో ఆగస్టు 15 నుంచి
# మహిళలకు ఉచిత బస్సు



- ఉచిత సిలిండర్ డబ్బులు 4 నెలలకు ఒకసారి లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- బడులు తెరిచేలోపే పిల్లలందరికీ తల్లికి వందనం
- అక్టోబరు 2 నాటికి చెత్త రహితంగా పట్టణాలు
- చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్లాంట్ల ఏర్పాటు
- కర్నూలు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**మే 17, సమయం న్యూస్, కర్నూలు:** మన ప్రభుత్వంలా కేవలం పింఛన్ల కోసమే ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేసే ప్రభుత్వం ప్రపంచంలోనే ఎక్కడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తామని

తరువాయి 2లో

## భారత క్షిపణులు
# మా స్థావరాలను తాకాయి

- పాక్ ప్రధాని షెహబాజ్ అంగీకారం

**మే 17, సమయం న్యూస్, ఇస్లామాబాద్:** భారత బాలిస్టిక్ క్షిపణులు తమ దేశంలోని నూర్‌ఖాన్ వాయు స్థావరాన్ని తాకినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. దాడి జరిగిన రోజు రాత్రి రెండున్నర గంటలకు ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ తనకు ఫోన్ చేశారని, నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర ప్రాంతాల్లో క్షిపణి దాడుల గురించి చెప్పారని ఆయన తెలిపారు. ఆ దాడులను అడ్డుకునేందుకు పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ తమ స్వదేశీ సాంకేతికతతోపాటు ఆధునిక చైనా రక్షణ వ్యవస్థలను వినియోగించినట్లు చెప్పారు. అయినా భారత క్షిపణులు, డ్రోన్లు కొన్ని తమ స్థావరాలను తాకాయని పేర్కొన్నారు.

తరువాయి 2లో





# ఆర్కిటెక్ట్ కావాలనుకున్నా..
## నాన్న కోర్కె తీర్చడానికి న్యాయవాదినయ్యా

- బాల్యం నుంచే నాలో రాజ్యాంగం నిక్షిప్తం
- బాబాసాహెబ్ ఆలోచనలతోనే పెరిగా..
- జస్టిస్ నారీమన్, జస్టిస్ లావు నాగేశ్వరరావుల ప్రోత్సాహాన్ని మరువలేను
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సన్మాన సభలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

**మే 17, సమయం న్యూస్, ఢిల్లీ:** ఆర్కిటెక్ట్ కావాలనుకున్న తాను.. తన తండ్రి కోరిక మేరకే న్యాయవాదినయ్యానని, ఇప్పటికీ ఆర్కిటెక్ట్ కావాలనుకున్న తన ఆకాంక్ష అలాగే ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (జస్టిస్ బి.ఆర్. గవాయ్) పేర్కొన్నారు. బాల్యం నుంచే తనలో రాజ్యాంగం నిక్షిప్తమై ఉందని, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలతోనే పెరిగి పెద్దయ్యానని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యాక తొలినాళ్లలో తనను జస్టిస్ నారీమన్, జస్టిస్ లావు నాగేశ్వరరావు ఎంతో ప్రోత్సహించారని వెల్లడించారు. ఈ నెల 14వ తేదీన సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బి.ఆర్.గవాయ్‌ను శనివారం ఢిల్లీలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. తన జీవిత

తరువాయి 2లో

# ప్రధాని మోదీతో ఏపీ మంత్రి లోకేశ్



- రెండు గంటలపాటు సుదీర్ఘ సమావేశం
- కుటుంబంతో కలిసి వచ్చిన మంత్రి

**మే 17, సమయం న్యూస్, ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రాష్ట్ర మంత్రి, తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం ఢిల్లీలో సమావేశమయ్యారు. సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌తో కలిసి రాత్రి 7.20 గంటలకు ప్రధాని అధికార నివాసం 7లోకకల్యాణ్ మార్గ్‌కు వెళ్లిన లోకేశ్ రాత్రి

తరువాయి 2లో

# తిరుపతిలో Rs500 కోట్లతో ఇంట్రా మోడల్ బస్ టెర్మినల్

- ప్రస్తుత బస్టాండ్ స్థానంలో నిర్మాణం
- 10 అంతస్తులు, 1.54 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణ ప్రాంతం
- బస్సుల కోసం 98 ప్లాట్‌ఫామ్‌లు
- ఆర్టీసీ, ఎన్‌హెచ్ఎల్ఎంఎల్, ప్రైవేటు గుత్తేదారు భాగస్వాములు



2లో

# అద్భుతాల ఒడిలో.. అందాల సడి

(మొదటిపేజీ తరువాయి)

సుందరీమణులతో కళకళలాడింది. ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడుతున్న 108 దేశాల అందాలభామలు రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడి చేశారు. శనివారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగులీనుతున్న ఫిల్మ్‌సిటీని చూసి అచ్చెరువొందారు. అలరించిన సంగీతానికి పాదాలు కదిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రధాన ద్వారం వద్దకు చేరుకోగా... వారికి రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్.కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ



మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్.విజయేశ్వరి, ఈటీవీ సీఈవో బాపినీడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఘనస్వాగతం పలికారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సిబ్బంది సంప్రదాయ రీతిలో కుంకుమబొట్లు పెట్టి, ముత్యాలదండలతో రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహారాష్ట్ర ప్రఖ్యాత పుణెరి డోల్ సంగీతానికి ప్రపంచ సుందరీమణులు మైమరచి అడుగులు కదిపారు.

**మహా దార్శనికుడి కలలధామం**

రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు, దివంగత రామోజీరావు అకుంఠిత దీక్షకు ప్రతిరూపం... లక్షల కళల స్వరూపం... కళాత్మకత, ప్రకృతి రసరమ్య ప్రదేశాల సంగమం... సినీ ప్రపంచానికి స్వర్గధామం, సువిశాల విస్తీర్ణంలో ఆద్యంతం ఆకట్టుకునే అందాలతో అలరిస్తున్న రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రత్యేకతలను వివరిస్తున్నప్పుడు ప్రపంచ సుందరీమణులు, మిస్‌వరల్డ్ పోటీల నిర్వాహకులు అమితాశ్చర్యానికి గురయ్యారు. విశేషాలను తెలుసుకునేందుకు ఎంతో ఆసక్తిని కనబరిచారు. ప్రకృతి అందాలను మధుర జ్ఞాపకంగా నిలుపుకొనేందుకు వందల సంఖ్యలో ఫొటోలు తీసుకున్నారు.

# ఏపీలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. దీపం 2 కింద ఉచిత సిలిండర్ల పథకంలో నాలుగు నెలలకోసారి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పారు. కర్నూలులో శనివారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 'దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. బడులు ప్రారంభమయ్యేలోపు ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం కింద డబ్బులు జమ చేస్తాం. రాయలసీమను రతనాలసీమగా మార్చే బాధ్యత మాదే. ప్రస్తుతం 18 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన పంటలను 2029 నాటికి 36 లక్షల హెక్టార్లకు పెంచుతాం. 16 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం ఉంది. 10 ఎకరాల్లోపు రైతులకు కూడా దీనిపై 90 శాతం రాయితీ ఇస్తున్నాం. పేదలకు ఉచిత కరెంటుతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీతో ఇంటిపై సౌరవిద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశమిస్తాం' అని చంద్రబాబు తెలిపారు.




**ఇంటింటా అవగాహన కల్పించాలి**

'ఈ ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటాను. డ్వాక్రా, మెప్మా సంఘాల్లోని వారికి చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన కల్పించాలి. పొడిచెత్త, తడిచెత్తను వేరు చేయాలని చెప్పాలి. తడిచెత్తతో కంపోస్టు ఎరువు తయారుచేసి రైతులకు అందిస్తే సంఘాలకు మంచి ఆదాయం వస్తుంది. ఓర్వకల్లులో డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారిపోయారు' అని సీఎం పేర్కొన్నారు. 'పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం గతంలో తెదేపానే పెట్టింది. ఇప్పుడది ఓ సర్క్యులర్ ఎకానమీలా మారిపోయింది. గత ప్రభుత్వం పట్టణాల్లో 85 లక్షల టన్నుల చెత్త వదిలిపెట్టింది. ఇప్పటికే 55 లక్షల టన్నుల చెత్తను నిర్మూలించాం. అక్టోబరు నాటికి మిగిలినది కూడా లేకుండా చేస్తాం. రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కడప ప్రాంతాల్లో చెత్త నుంచి విద్యుత్తు తీసే ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. పల్లె పుష్కరిణి కార్యక్రమంతో చెరువులను పరిశుభ్రం చేస్తాం. చెరువుకట్టలను తీర్చిదిద్ది నడిచేందుకు ఏర్పాట్లు చేస్తాం. 15,995 గ్రామాలను ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత) ప్లస్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికి 6,258 గ్రామాలను చేశాం. 2026 మార్చికల్లా నూరు శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. రాష్ట్రంలో 120 రైతు బజార్లున్నాయి. త్వరలోనే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 తీసుకొచ్చి, ఆదర్శంగా తీర్చిదిద్దుతాం' అని చంద్రబాబు చెప్పారు.

**వ్యర్థాల నిర్వహణపై బుద్ధుడి కథ**

ప్రపంచంలో వ్యర్థమైంది ఏదీ లేదంటూ చంద్రబాబు బుద్ధుడు, ఆయన శిష్యుడి కథ చెప్పారు. 'బుద్ధుణ్ని ఆయన శిష్యుడు ఒకరు ప్రభూ.. నా దుస్తులు పూర్తిగా చినిగిపోయాయి, కొత్తవి ఇవ్వండని అడిగాడు. బుద్ధుడు అతనికి కొత్త వస్త్రాలు ఇవ్వాలని ఆదేశిస్తాడు. కొన్నిరోజుల తర్వాత శిష్యుణ్ని పిలిచి కొత్తవి కదా పాతవి ఏం చేశావు? అని అడుగుతాడు. గురువుగారూ నా పడక బొంత పూర్తిగా చెడిపోయింది.. నా పాత దుస్తులతో దాన్ని కుట్టుకున్నానని శిష్యుడు జవాబిస్తాడు. నీ పాత పరుపులో ఉన్న దుస్తులు ఏమయ్యాయని అడిగితే వాటిని కిటికీకి తెరగా కట్టానంటాడు. పాత తెరను ఏం చేశావంటే.. వంట గదిలో మసిగుడ్డగా వాడుతున్నానని బదులిస్తాడు. అంతవరకు వంట గదిలో ఉన్న గుడ్డను ఏం చేశావని ప్రశ్నిస్తే.. దాన్ని గది తుడవడానికి వాడుతున్నానని చెబుతాడు. అప్పటి వరకు గది తుడిచిన వస్త్రాన్ని ఏం చేశావంటే.. అది పూర్తిగా చెడిపోయి దారాలు వచ్చేస్తున్నాయి. వాటితో కొవ్వొత్తులకు ఉపయోగించే వత్తులను తయారుచేశానని వివరిస్తాడు. ప్రపంచంలో ఉపయోగం లేని వస్తువు ఏదీ లేదన్నది ఈ కథ సారాంశం. వ్యర్థాల నిర్వహణలోనూ ఇదే వర్తిస్తుంది' అని చంద్రబాబు వివరించారు.

# ప్రధాని మోదీతో ఏపీ మంత్రి లోకేశ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

9.30 వరకు ప్రధానితో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ తొలిసారి ఈ ఏడాది జనవరి 8న అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు. ఈ నెల 2న అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికీ హాజరయ్యారు. ఈ రెండు సందర్భాల్లోనూ తనకు స్వాగతం పలికిన లోకేశ్‌ను.. దిల్లీకి వచ్చినప్పుడు తనను ఎందుకు కలవలేదని ఆరా తీశారు. ఈసారి వచ్చినప్పుడు కలవాలని ప్రత్యేకంగా చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి లోకేశ్ ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని శనివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోదీ.. లోకేశ్, ఆయన కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు.

**ఈ సమావేశం.. చిరస్మరణీయం**

'ప్రధానితో ఈ సమావేశం లోకేశ్ కుటుంబానికి ఎంతో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా 3,132 కిలోమీటర్ల మేర లోకేశ్ పాదయాత్ర చరిత్రాత్మకంగా సాగిన విధానాన్ని వివరిస్తూ ప్రచురించిన యువగళం కాఫీ టేబుల్ బుక్‌ను.. ప్రధానమంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని మోదీ ఒక పుస్తకంపై సంతకం చేసి లోకేశ్‌కు బహూకరించారు. ఇది అరుదైన, మధురమైన జ్ఞాపకం. ఈ సమావేశం సందర్భంగా బ్రాహ్మణి, దేవాంశ్‌లను ప్రధాని ఆశీర్వదించారు. రాష్ట్ర పురోగతికి నిరంతరం చేయూతనందిస్తున్నందుకు మోదీకి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. జాతీయ భద్రత, దేశపురోగతి కోసం ప్రధాని అందిస్తున్న బలమైన, నిర్ణయాత్మక నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ తనవంతు చేయూతనందించడానికి అవసరమైన మార్గదర్శనం చేయాలని ప్రధానిని కోరారు' అని లోకేశ్ కార్యాలయం సమావేశానంతరం ఓ ప్రకటనలో తెలిపింది.

# తిరుపతిలో Rs500 కోట్లతో ఇంట్రా మోడల్ బస్ టెర్మినల్

శ్రీవారి దర్శనానికి నిత్యం భారీగా తరలివచ్చే భక్తులకు అనేక వసతులు ఒకే చోట లభించేలా తిరుపతిలో ప్రస్తుతమున్న బస్టాండ్ స్థానంలో ఇంట్రా మోడల్ బస్ టెర్మినల్ నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్టాండ్, దానిపై 10 అంతస్తుల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు.. తదితరాలకు కేటాయించేలా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో ఆర్టీసీ తన స్థలాన్ని కేటాయిస్తుండగా, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్) కొంత సొమ్ము, మరో ప్రైవేటు గుత్తేదారు సంస్థను ఎంపిక చేసి దాని ద్వారా కొంత డబ్బు వెచ్చించనున్నారు. ప్రస్తుతం తిరుపతి బస్టాండ్ 13.18 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో 12.19 ఎకరాల్లో ఇంట్రా మోడల్ బస్ టెర్మినల్ నిర్మించనున్నారు.



* ప్రస్తుతం బస్టాండ్‌కు మూడు వైపులా రోడ్లు ఉన్నాయి. కొత్తగా నిర్మించే టెర్మినల్‌కు మాత్రం నాలుగు వైపులా రోడ్లు ఉండేలా డిజైన్ చేశారు.
* సెల్లార్‌లో 2 అంతస్తులు ఉంటాయి. దీన్ని బైక్‌లు, కార్ల పార్కింగ్‌కు కేటాయిస్తారు.
* గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం బస్టాండ్‌కు కేటాయిస్తారు. 98 ప్లాట్‌ఫామ్‌లతో భారీ బస్టాండ్ నిర్మిస్తారు. అదనంగా 50 బస్సులు పార్కింగ్ చేసేలా, విద్యుత్ బస్సుల ఛార్జింగ్‌కు కూడా వీలుండేలా ఏర్పాట్లు చేస్తారు.
* మొదటి, రెండో అంతస్తుల్లో కొంత ఆర్టీసీ కార్యాలయాలకు కేటాయించగా, మిగిలిన స్థలాన్ని ఫుడ్‌కోర్టులు, దుకాణాలు తదితరాలకు కేటాయిస్తారు.
* మూడో అంతస్తు కేవలం సర్వీసెస్ కోసం వదిలేస్తారు. భవనానికి సంబంధించి విద్యుత్ నిర్వహణ, సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ తదితరాలన్నీ ఇందులో ఉంటాయి.
* నాలుగు నుంచి ఏడో అంతస్తు వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలు, ఇతర వాణిజ్య అవసరాలకు కేటాయిస్తారు.
* ఎనిమిది, తొమ్మిది, పదో అంతస్తుల్లో కమర్షియల్‌గా బ్యాంకులు, ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు.. తదితరాలకు కేటాయించేలా నిర్మాణం చేస్తారు.
* పదో అంతస్తుపైన హెలిప్యాడ్ నిర్మాణం చేయనున్నారు.
* మొత్తంగా 1.54 లక్షల చదరపు *అడుగుల మేర బిల్ట్‌అప్ ప్రాంతం ఉంటుంది.

# ప్రపంచ తొలి 'ఏఐ డాక్టర్!'

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యం ద్వారా అల్‌మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సౌదీలోని అల్ అహ్సా ప్రావిన్స్‌లో ఇది ఏర్పాటైంది. రోగులతో తొలుత సంభాషించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స చేసే బాధ్యత నుంచి వైద్యులను తప్పించడం దీని ఉద్దేశం. "ఈ ఏఐ క్లినిక్ వినూత్న వైద్య సేవా వ్యవస్థ. ఇందులో ఏఐ వ్యవస్థ స్వతంత్రంగా.. వివరాల సేకరణ నుంచి మందులు సూచించడం వరకూ పలు సేవలు అందిస్తుంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతుంది. వారు వ్యాధి నిర్ధారణ, చికిత్స ఫలితాలను సమీక్షిస్తారు" అని సైన్సీ సంస్థ పేర్కొంది.

**పనిచేసేదిలా!**

ఏఐ వైద్య వ్యవస్థకు 'డాక్టర్ హువా' అని పేరుపెట్టారు. క్లినిక్‌కు వచ్చాక.. ఒక ట్యాబ్ సాయంతో ఏఐకి తమ వ్యాధి లక్షణాలను రోగి వివరించాలి. వెంటనే అది మరిన్ని ప్రశ్నలు సంధిస్తుంది. మానవ సహాయకుల సాయంతో సేకరించిన డేటాను, చిత్రాలను విశ్లేషిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే డాక్టర్ హువా ఒక చికిత్స ప్రణాళికను అందిస్తుంది. దీన్ని వైద్యుడు కూలంకషంగా సమీక్షించి, సంతకం చేస్తారు. అయితే ఏఐ పరిశీలించలేని అత్యవసర కేసుల కోసం వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం ఈ ఏఐ డాక్టర్ ద్వారా ఉబ్బసం సహా దాదాపు 30 రకాల శ్వాసకోశ రుగ్మతలకు సంబంధించిన కన్సల్టేషన్ సేవలను అందిస్తున్నారు. వైద్యుల డేటాబేస్‌ను విస్తరించి, 50 శ్వాస, జీర్ణకోశ, చర్మ సంబంధ వ్యాధులకు ఈ సేవలను అందించాలని భావిస్తున్నట్లు సైన్సీ ఏఐ తెలిపింది.

# భారత క్షిపణులు మా స్థావరాలను తాకాయి

(మొదటిపేజీ తరువాయి)

నూర్‌ఖాన్ స్థావరం రాజధాని ఇస్లామాబాద్‌కు 25 కిలోమీటర్లలోపే ఉంది. శుక్రవారం రాత్రి 'భారత్‌పై విజయం' పేరుతో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా కార్యక్రమంలో షరీఫ్ ఈ వివరాలను వెల్లడించారు. దక్షిణాసియా ప్రాంతంలో పోలీసు పెద్దన్నగా వ్యవహరిస్తున్నామని చెప్పుకొనే భారత్‌ను ముక్కలు చేశామని, పాక్ ఫాల్కన్లు.. ఆ దేశాన్ని కోలుకోలేని దెబ్బతీశాయని పేర్కొన్నారు. భారత్, పాక్‌లు.. శాంతి స్థాపన కోసం ఇరుగుపొరుగుగా కూర్చుని మాట్లాడుకోవాలని, కశ్మీర్‌లాంటి సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రతిపాదించారు.

# ఆర్కిటెక్ట్ కావాలనుకున్నా.. నాన్న కోర్కె తీర్చడానికి న్యాయవాదినయ్యా

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్థానాన్ని ఆవిష్కరించారు. 'మా నాన్న తన యుక్త వయసులోనే.. బాబాసాహెబ్ అంబేద్కర్ నడిపిన సామాజిక ఉద్యమంలోకి వెళ్లారు. డిగ్రీ పూర్తయ్యాక న్యాయవాది కావాలనుకున్నారు.. జైలుకెళ్లడంతో ఎల్ఎల్‌బీ పరీక్షలు రాయలేకపోయారు. అందుకే తన కుమారుల్లో ఒకరు న్యాయవాది కావాలనుకున్నారు. ఇంటికి పెద్ద కుమారుడిగా నేను ఆ బాధ్యత తీసుకుని న్యాయశాస్త్రాన్ని ఎంచుకున్నాను' అని జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు.

**సామాజిక, ఆర్థిక న్యాయం దిశగా..**

19 ఏళ్లు హైకోర్టు జడ్జిగా, 6 ఏళ్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా.. నాకు ఎక్కడ అవకాశం వచ్చినా చేతనైనంత మంచి చేశా. రాజ్యాంగ పరిమితులకు లోబడి సామాజిక, ఆర్థిక న్యాయం చేయడానికి ప్రయత్నించా. నాకు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ బోబ్డే, జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎన్.వి.రమణలతో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. జస్టిస్ నారీమన్ ధర్మాసనంలో సుమారు ఏడాదిపాటు కొనసాగాను. ఆయన నన్ను ప్రోత్సహించి తీర్పులు రాయించారు. ఆ తర్వాత ఏడాది పాటు జస్టిస్ లావు నాగేశ్వరరావు ధర్మాసనంలో ఉన్నాను. ఆయన అత్యుత్తమ న్యాయమూర్తే కాదు.. అత్యుత్తమ వ్యక్తి కూడా. ఆయనతో కూర్చున్న ఏడాది కాలంలో ఎన్నో తీర్పులు రాసేలా ప్రోత్సహించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నేను ఇచ్చిన తీర్పుల ద్వారా డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలను అనుసరించి ఈ దేశంలో చిట్టచివరి వ్యక్తికి న్యాయం చేయడానికే ప్రయత్నించాను' అని జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు.

**న్యాయమూర్తుల నియామకంలో భిన్నత్వం**

'న్యాయమూర్తుల నియామకంలో భిన్నత్వం, సమ్మిళితం ఉండాలని నేను నిరంతరం కోరుకున్నాను. గతంలో ఇక్కడ ప్రధాన న్యాయమూర్తుల సదస్సు జరిగినప్పుడు జడ్జి పోస్టులకు.. అణగారిన, మహిళ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన పేర్లు పంపాలని సూచించాను. హైకోర్టు న్యాయమూర్తి పదవులకు అర్హులైన మహిళలు లేకపోతే సుప్రీంకోర్టు న్యాయవాదులను తీసుకోవాలని ఎంతో మంది ప్రధాన న్యాయమూర్తులకు వ్యక్తిగతంగా చెప్పాను. సుప్రీంకోర్టు న్యాయవాది మహాలక్ష్మి పావని పేరును తప్పనిసరిగా నేను కొలీజియం ముందుంచుతాను' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. 'మన ప్రజాస్వామ్య మూడు ప్రధాన వ్యవస్థల పనితీరు సంతృప్తికరంగా ఉంది. నేను ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కర్ణాటకలో అత్యంత వెనుకబడిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పేరును సిఫారసు చేసినందుకు సంతోషంగా ఉంది. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎక్కువ మందిని కలవడం మంచిది కాదని కొందరు సూచించారు. అయితే ఆ ఏకాంతవాస సూత్రాన్ని నేను నమ్మను. మనం సమాజంలోకి వెళ్లకపోతే అది ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియదు. వాగ్దానాలు ఇవ్వాల్సి వస్తుందనే నేను మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. వాగ్దానాలు ఇచ్చి విస్మరిస్తే అంతిమంగా అదే మీడియా విమర్శిస్తుంది. నాకున్న స్వల్పకాలంలో నా ప్రమాణ స్వీకారానికి కట్టుబడి.. న్యాయాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి చేతనైనంత చేస్తాను. చిట్టచివరి అత్యంత సాధారణ వ్యక్తిని చేరుకోవడానికి ప్రయత్నిస్తాను. రాజ్యాంగ నిర్మాతల విజన్ అయిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని వాస్తవంలో చూపించడానికి కృషి చేస్తాను. ప్రతి నిమిషం ఈ సమాజం కోసమే పని చేస్తాను' అని ఆయన పేర్కొన్నారు.

# ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కారం

* **మంత్రి పొంగులేటి**

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: ధరణి పోర్టల్‌తో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, వాటి శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ సమస్యకు పరిష్కారం చూపి పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామని, ఇందుకోసం 10,956 గ్రామాలకు రెవెన్యూ అధికారులు, 6 వేల మంది సర్వేయర్లను కొత్తగా నియమిస్తున్నామని తెలిపారు. శనివారం మెదక్ జిల్లాలోని చిలప్‌చెడ్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రితోపాటు భాజపా ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, భారాస ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములకు అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సర్వే నంబరును తెలిపేలా భూములకు భూదార్ కార్డులను అందించడం హర్షించదగ్గ విషయమన్నారు.

# పుష్కరాలలో అపద లో ఉన్న వారికి ఎమర్జెన్సీ సర్వీసులు

క్యాకేశ్వరం మే 17( సమయం న్యూస్) : కాలేశ్వరంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని 108 ఎమర్జెన్సీ సర్వీసెస్ అంబులెన్స్లని అత్యవసర సేవల కొరకు 5 అంబులెన్స్ ఉంచాము. ఎటువంటి అత్యవసర సేవల కొరకైన ఈ క్రింది నెంబర్లకు కాల్ చేయగలరు.

1. PHC కాళేశ్వరం అంబులెన్స్ నెం: 8712615698
2. VIP ఘాట్ అంబులెన్స్ నం: 8712615687
3. గోదావరి ఘాట్ : 9063449664
4. ప్రధాన ఆలయ అంబులెన్స్ నెం: 9063449674
5. బస్ స్టాండ్ ఘాట్ నం: 8712615685

108 జిల్లా మేనేజర్: నరేష్ సెల్ నెం: 9154269788

# స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

* **జిల్లా కలెక్టర్ కు టిపిటిఎఫ్ వినతి పత్రం**

గజ్వేల్, మే 17 : పాఠశాలల పరిశుభ్రత కోసం పనిచేస్తున్న స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు చిట్యాల విజేందర్ రెడ్డి,సుంచు నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కార్యదర్శి సత్యనారాయణ తో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరికి శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారి తో మాట్లాడుతూ పాఠశాలల పరిశుభ్రత కోసం స్కావెంజర్లను నియమిస్తూ,వారికి పది నెలల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని , ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఆరు మాసాలకు సంబంధించిన వేతనాలు మాత్రమే విడుదల అయ్యాయని, పెండింగ్ లో ఉన్న నాలుగు మాసాల వేతనాలు విడుదల చేయాలని కోరారు. 6,7 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ లను అందించాలని, పాఠశాలల్లో కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్ లను నియమించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో గణిత ల్యాబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరారు.






# పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ

పాలకొండ, సమయం న్యూస్, మే 17: "ఆపరేషన్ సింధూర్" విజయవంతం అయిన సంధర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా పాలకొండ పట్టణంలోని కోటదుర్గ అమ్మవారి ఆలయం నుండి పాలకొండ బస్ స్టాండ్ వరకు నిర్వహించిన "తిరంగా ర్యాలీ"లో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ

## రాష్ట్ర తాజా మాజీ మంత్రులకు
# శ్రీ గురు పీఠం లో ప్రాణ ప్రతిష్ట పూజ ఆహ్వాన పత్రిక అందజేత!

* **శ్రీ గురు పీఠం ఫౌండర్ చైర్మన్ జి, శివకుమార్ గౌడ్!!**

శివంపేట్ మే 17 (సమయం న్యూస్) : శివంపేట మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం మరియు శ్రీ దత్తాత్రేయ దేవాలయం లో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి రావలసిందిగా తాజా మాజీ రాష్ట్ర మంత్రులకు ఆహ్వాన పత్రికను గురు పీఠం పౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ రాష్ట్ర మంత్రులకు తన్నీరు హరీష్ రావు కు మరియు శ్రీనివాస్ గౌడ్ కు నివాసంలో నర్సాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు సునిత లక్ష్మారెడ్డి , మాజీ అటవి శాఖ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి తో కలసి శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ ట్రస్టు సభ్యులు బారాస. శివంపేట మండల అధ్యక్షులు శ్రీ రాజా రమణ గౌడ్ మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ , మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ , మాజీ ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్ గౌరె వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి రాజశేఖర్ గౌడ్ తో కలిసి శ్రీ గురు పీఠం గూడూరు గ్రామంలో జూన్ 5 న జరిగే శ్రీ దత్తాత్రేయ మహా స్వామి మరియు శ్రీ షిరిడి సాయిబాబా ప్రాణ ప్రతిష్ట పూజ ఆహ్వాన పత్రికను అందజేసి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి రావాల్సిందిగా హరీష్ రావు ను మరియు శ్రీనివాస్ గౌడ్ ను ఆహ్వానించారు. తెలంగాణ తాజా మాజీ రాష్ట్ర మంత్రులు హరీష్ రావు మరియు శ్రీనివాస్ గౌడ్ స్పందిస్తు తప్పకుండా వస్తామని చెప్పారు అని గురు పీఠం ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ అన్నారు.







# ఆంజనేయ స్వామి దేవస్థానంలో పూజ సామాగ్రి వేలం పాట

శివంపేట్ మే 17 (సమయం న్యూస్) : శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో టెంకాయలు, పూజ సామాగ్రి వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్యనిర్వకధికారి సార శ్రీనివాస్ తెలిపారు, శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ శివారులో గల చకరిమెట్ల అభయారణ్యంలో స్వయంభుగా వెలిసిన శ్రీ సహకారం ఆంజనేయస్వామి దేవస్థానం లో ప్రతి ఏటా నిర్వహించే వేలం పాటను 2025 2026 సంవత్సరానికి గాను ఈనెల 20వ తారీకు, ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు, వేలం పాటలో పాల్గొనాలి అనుకున్నవారు, ఒక పాస్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రెండు బ్యాంక్ చెక్కులు, వంద రూపాయల బాండ్ పేపర్, లతోపాటు శ్రీ సహకారాంజనేయ స్వామి దేవస్థానం పై లక్ష రూపాయల డిపాజిట్ డిడి, లేదా నగదు రూపంలో తీసుకొని వేలంపాటకు గంట ముందు దేవస్థానం వద్దకు రావాల్సిందిగా దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్యనిర్వాహక అధికారి సారా శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు,

# పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు

* **సమన్వయంతో పని చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలి**
* **బక్రీద్ సందర్భంగా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సీ.పీ**

నిజామాబాద్, మే 17 (సమయం న్యూస్) పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీ సమీక్షించారు. బక్రీద్ పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అన్నారు. గోవధ నిషేధ చట్టం 1977 ప్రకారం గోవులను వధించడంపై నిషేధం ఉందని, తెలంగాణాలో ఒంటెలను కూడా వధించకుండా నిషేధం అమలులో ఉందని సూచించారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఎక్కడ కూడా గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పొతంగల్, ఖండ్ గావ్ అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీ.పీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయమనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. సీజ్ చేసిన పశువులకు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశు గ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటదివెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏ.సీ.పీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ ఓబిసి మోర్చా సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ను పరామర్శించిన ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ మరియు అధికార ప్రతినిధి శంకరోల రవి.

## మారక ద్రవ్యాల నియంత్రణ లో
# తెలంగాణ ప్రపంచంలోనే మొదట స్థానం సాధించడం గర్వ కారణం

* **సి ఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ మే17( సమయం న్యూస్) : మాదక ద్రవ్యాల నియంత్రణలో 138 దేశాలతో పోటీ పడి తెలంగాణ పోలీసు ప్రపంచం లోనే నంబర్ వన్ స్థానాన్ని సాధించడం గర్వ కారణంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఎక్సలెన్స్ ఇన్ యాంటీ నార్కొటిక్స్' కేటగిరీలో మొదటి బహుమతిని అందుకున్న సందర్భంగా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీస్ సమ్మిట్‌లో హైదరాబాద్ సీపీ ఈ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవీ ఆనంద్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు..






## షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట, మే, 17(సమయం న్యూస్): అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. అంబర్ పేట కార్పొరేటర్ శ్రీ విజయ కుమార్ గౌడ్ గారు మరియు బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి ఎమ్మార్వో లలితా బాయి తో కలిసి అంబర్ పేట మండల కార్యాలయంలో 47 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.



## కంగ్టి ఎస్ఐగా దుర్గారెడ్డి భాధ్యతలు

కంగ్టి, 17మే (సమయం న్యూస్) : కంగ్టి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా దుర్గారెడ్డిని నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన పదవి బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విజయ్ కుమార్ జిల్లా కేంద్రంలోని వీఆర్ కు బదిలీ అయ్యారు. అక్కడ వీఆర్ లో ఉన్న దుర్గారెడ్డి బదిలీపై కంగ్టికి వచ్చారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై దుర్గారెడ్డి మాట్లాడుతూ..మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదులకు సమన్వయం అందిస్తానని తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తూ...... మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కృషి చేస్తానని, అదేవిధంగా మండలంలోని ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

* **కళాశాల ప్రిన్సిపల్ ఏ. వెంకటనారాయణ**

జిన్నారం, మే 17, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారం లో గల గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులో మిగిలిన ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల 20వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు జిన్నారంలో గల కళాశాలకు సంబంధిత సర్టిఫికెట్లను తీసుకొని హాజరు



కావలసిందిగా ఆయన కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి భరత్ భూషణ్

గుమ్మడిదల ,మే 17,సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పోలీస్ స్టేషన్లో నూతన ఎస్సైగా జి భరత్ భూషణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన ఎస్సై భరత్ భూషణ్ మాట్లాడుతూ బి డి ఎల్ బానూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. గుమ్మడిదల మండల ప్రజలు శాంతి సామరస్యాలతో ఉండాలని, పోలీసులకు ,ప్రజలకు మధ్య మిత్రుత్వ భావం ఉండాలని




అన్నారు .ఎవరైనా శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

# ఏది సత్యం? ఏదసత్యం!?

'జంగ్ ఔర్ మొహబ్బత్ మే సబ్ జాయజ్ హోతా హై' అనేది ఒక హిందీ సామెత. అంటే దీనర్థం యుద్ధం, ప్రేమలో ప్రతీది సమంజసమే. దీన్ని నరనరాన ఒంటబట్టించుకున్న ఇండియా, పాకిస్తాన్ కు చెందిన మీడియా చానళ్లు.. యుద్ధ సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించాయి. సమాజం పట్ల తమకు సైతం ఒక నైతిక బాధ్యత ఉంటుందని మరిచి.. ఫేక్ న్యూస్ ను ప్రసారం చేశాయి. సోషల్ మీడియాలోనూ జోరుగా అసత్య ప్రచారం వైరల్ అయింది. దీంతో ప్రజల్లో భయాందోళనలు, మానసిక ఒత్తిడి రెకెత్తింది. అయితే ఇండియాలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్, ఆల్ట్ న్యూస్, పాకిస్తాన్ లో మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ వంటి సంస్థలు ఫ్యాక్ట్ చెక్ చేసి అనేక అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తెచ్చాయి. ఆ తర్వాత కొన్ని చానళ్లు క్షమాపణలు కోరినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు దేశాల మీడియా చానళ్లపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత తగ్గిపోయింది. మరోవైపు ఆయా దేశాల ప్రజలకు మీడియా వ్యవహరిస్తున్న తీరు తెలిసొచ్చింది.

### అనేక క్లెయిమ్స్ ఫేక్..

భారత్, పాకిస్తాన్ కు చెందిన న్యూస్ చానళ్లు, సోషల్ మీడియా అకౌంట్లు యుద్ధ సమయంలో చేసిన అనేక క్లెయిమ్స్ ఫేక్ అని ఆ తర్వాత నిర్ధారించబడ్డాయి. భారత రాఫెల్ యుద్ధ విమానం బహవల్పూర్ సమీపంలో కూల్చివేశారని, భారత సైనిక స్థావరంపై దాడి జరిగిందని పాకిస్తాన్ కు చెందిన కొన్ని చానళ్లు, సోషల్ మీడియా ఖాతాలు క్లెయిమ్ చేశాయి. అయితే ఆ వీడియోలు, చిత్రాలు 2021లో పంజాబ్‌లో జరిగిన మిగ్21 క్రాష్, 2024లో మహారాష్ట్రలో సుఖోయ్30 క్రాష్‌కు సంబంధించినవిగా తేలింది. పాకిస్తాన్‌లోని నన్కానా సాహిబ్ గురుద్వారాపై డ్రోన్ దాడి జరిగిందని జరిగిన ప్రచారాన్ని సైతం పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించింది. 2020లో లెబనాన్‌లోని బీరుట్ పేలుడు ఫుటేజీని భారత్‌పై మిస్సైల్ దాడిగా పాకిస్తాన్ మీడియా చిత్రీకరించింది. మరోవైపు కరాచీ పోర్టుపై భారత నావికాదళం దాడి చేసిందని ఆజ్ తక్ చానల్ తప్పుడు వార్తను ప్రసారం చేసింది. ఆ తర్వాత అది ఫేక్ అని తేలింది. రెండు జేఎఫ్17 జెట్ లు కోల్పోయామని పాకిస్తాన్ సైనిక అధికారి ఒప్పుకున్నట్లు ఒక ఏఐ జనరేటెడ్ డీప్ ఫేక్ వీడియోను ఒకరు పోస్టు చేయగా, దాన్ని ఏడు లక్షల సార్లు షేర్ చేశారు. అయితే ఆ తర్వాత అది నకిలీదని గుర్తించారు. అంతేకాకుండా ఇస్లామాబాద్ ను భారత సైన్యం స్వాధీనం చేసుకున్నదని, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బంకర్ లో దాక్కున్నారని, భారత్ కు లొంగిపోయారని, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ రాజీనామా చేశారని, ఆయనను అరెస్ట్ చేశారని, పాకిస్తాన్ సైనికులను భారత్ ఖైదీలుగా చేసుకున్నదని ఇండియన్ మీడియా ఊదరగొట్టింది. అయితే ఇవన్నీ అసత్యాలేనని తర్వాత తేలింది.

### ఫ్యాక్ట్ చెకింగ్ తప్పనిసరి..

తప్పుడు, అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తేవడానికి ఫ్యాక్ట్ చెకింగ్ తప్పనిసరిగా మారింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైందని, భారత పైలట్ శివానీ సింగ్‌ను పాకిస్తాన్ అదుపులోకి తీసుకున్నదని, ఇలాంటి 60కి పైగా జరిగిన అసత్య క్లెయిమ్ లను పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించి వాస్తవాలను ప్రజల ముందుంచింది. పాకిస్తానీ జర్నలిస్టులు పాత ఘటనలను సంబంధించిన చిత్రాలను షేర్ చేస్తున్నట్లు ఆల్ట్ న్యూస్ సహస్థాపకుడు ప్రతీక్ సిన్హా గుర్తించి ప్రజల ముందుకు తెచ్చారు. పాకిస్తాన్‌లోని మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అక్కడి స్థానిక మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని గుర్తించి రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా ఫ్యాక్ట్ చెక్ చేసి వాస్తవాలను ప్రజల ముందుకు తెచ్చింది.

### అనేక దుష్పరిణామాలు

ఇండియాకు చెందిన కొన్ని న్యూస్ చానల్స్ లైవ్ రిపోర్టింగ్ చేస్తున్నట్లు నటించాయి. ఫలానా చోటి నుంచి సైనికులు బయలుదేరారని, ఎయిర్ క్రాఫ్ట్ లు బయలుదేరాయని చెప్పాయి. దీని ద్వారా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు భారత్‌లో 70% విద్యుత్ గ్రిడ్ సైబర్ దాడి వల్ల కుప్పకూలిందని, పాకిస్తాన్ మిస్సైల్ దాడులు చేసిందని వంటి కొన్ని తప్పుడు క్లెయిమ్ లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. అసత్య సమాచారం వల్ల ప్రజల్లో ఆందోళన, భయం, ఒత్తిడి పెరిగింది. నన్కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసిందని పాకిస్తానీ ఖాతాలు చేసిన తప్పుడు క్లెయిమ్స్ తో భారత్‌లో సిక్కు సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించే ఉద్దేశ్యంతో ఉందని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ గుర్తించింది. అయితే తప్పుడు క్లెయిమ్స్ ఆయా దేశాల మీడియా ఖ్యాతిని అంతర్జాతీయంగా దెబ్బతీశాయి. మీడియా సంస్థలు విశ్వాసాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఏఐ, డిజిటల్ యుగంలో న్యూస్ చానల్స్, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మొదటిసారే విశ్వసించకుండా క్రాస్ చెక్ చేసుకోవడం మంచిది. ఇలాంటి ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ సైతం తమ అల్గారిథమ్ లో మార్పులు చేయాల్సిన అవసరముంది. న్యూస్ చానల్స్ కూడా బాధ్యతగా వ్యవహరించి వాస్తవాలను మాత్రమే ప్రసారం చేయాలి.

* **ప్రపంచాన్ని భయపెట్టిన రేడియేషన్ లీక్**

పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్ వద్ద ఉన్న అణు స్థావరాలపై భారత్ దాడి చేసిందని, దీని వల్ల న్యూక్లియర్ రేడియేషన్ లీక్ అవుతోందని ఒక పత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు ఏఐ ద్వారా ఈ పత్రాన్ని క్రియేట్ చేశారు. స్థానిక ప్రజలు వాంతులు, తలనొప్పి, వికారం వంటి లక్షణాలతో బాధపడుతున్నారని, ఇది రేడియేషన్ లీక్‌కు సంకేతమని అందులో పేర్కొన్నారు. భారత సైనిక దాడులు సర్గోధా, నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నాయని, కిరానా హిల్స్ సమీపంలో జరిగిన దాడుల వల్ల రేడియేషన్ లీక్ జరిగిందని ఇందులో పేర్కొన్నారు. దీన్ని 'ఎక్స్'లో కొన్ని లక్షల సార్లు షేర్ చేశారు. దీంతో పాకిస్తాన్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నది. ఒక సందర్భంలో ఇది భారత్‌పాకిస్తాన్ మధ్య అణు యుద్ధ భయాన్ని సైతం రేకెత్తించింది. అయితే ఇది నకిలీదని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో ఎటువంటి న్యూక్లియర్ రేడియేషన్ లీక్ కాలేదని చెప్పింది. ఈ పత్రంలో అనేక తప్పులు ఉన్నాయని పేర్కొంది. భారత్ చర్యలు సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే ఉన్నాయని, అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కూడా స్పష్టం చేశారు.



ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

# సీఎంఆర్ఎఫ్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, మే17: అనారోగ్యంతో బాధపడేవారు, ప్రమాదానికి కూడా చికిత్స పొందేవారు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 47 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వంలో లక్షలాదిమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగిందని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స కోసం ప్రజలు బయట నుండి అప్పులు చేసి వైద్యాన్ని పొందుతున్నారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో కూడా కోతలను విధించడం, తక్కువ డబ్బులను



మంజూరు చేయడం బాధాకరమన్నారు. గజ్వేల్ కు చెందిన గుంటుకు బాలకృష్ణ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు దాదాపు రూ.47 లక్షల వరకు ఖర్చు పెట్టారని, రూ. 47 లక్షల బిల్లును సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేస్తే రూ. 60 వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేయడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను పెంచి సిఎంఆర్ఎఫ్ దరఖాస్తు పెట్టుకున్న వారికి గరిష్ట మొత్తం మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, వర్గల్ ఎంపీపీ లతా రమేష్ గౌడ్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, మరికంటి కనకయ్య, గుంటుకు రాజు, రహీం,, హైదర్ పటేల్, ఉపేందర్ రెడ్డి, కిరణ్ గౌడ్, ఉమర్, అహ్మద్, అబ్దుల్, రాజు, కరీం లబ్ధిదారులు తదితరులున్నారు






* పాలకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో TIFFA స్కానర్ ను ప్రారంభించిన పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ.
* ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పీ.ఓ యశ్వంత కుమార్ రెడ్డి,పాలకొండ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ నాగభూషణరావు పాల్గొన్నారు.

- సమయం న్యూస్, మే 17, పాలకొండ :

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# కడెం పరివాహక ప్రాంతాల్లో ముంపు నివారణకు చర్యలు చేపడతాం

* **కడెం ప్రాజెక్టును పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్.**





నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మే 17( సమయం న్యూస్) : కడెం నది పరివాహక ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించి, గేట్ల పనితీరు, వరద నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండర్ దామోదర్ సింగ్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ప్రాజెక్టు వద్ద జరిగిన విస్తృత సమీక్షలో ప్రత్యేక కార్యదర్శి పాల్గొన్నారు. గతంలో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగిన సమయంలో గేట్లు ఎత్తే ప్రక్రియలో లోపాలు తలెత్తిన నేపథ్యంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. దీనిపై స్పందించిన అర్వింద్ కుమార్, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లో వరద ముప్పుకు గురయ్యే 10 నుంచి 12 గ్రామాల్లో మెరుగైన అలారం వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు వరద నీటిని సమర్థవంతంగా నియంత్రించేందుకు నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు నిర్వహణ తీరును పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎస్ ఈ రవీందర్, ఈఈ విట్టల్, తహసిల్దార్లు ప్రభాకర్, సర్వరాజ్, ఎం పి డి ఓ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



## టీజీఐఐసి భూములు పరిశీలించిన ఈడి నిఖిల్ చతుర్వేది

గజ్వేల్, మే 17: సిద్దిపేట జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల కోసం కేటాయించిన భూములను టీజిఐఐసి ఈడి నిఖిల్ చతుర్వేది శనివారం పరిశీలించారు. సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్ మండలాల్లో టీజిఐఐసి ఈడి నిఖిల్ చక్రవర్తి పర్యటించారు. వర్గల్, ములుగు మండలాల్లోని ములుగు, పీర్లపల్లి, కొత్తూరు, వర్గల్ , తునికి బొల్లారం గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. సుమారు వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు టీజిఐఐసి ఈడి నిఖిల్ చక్రవర్తి తెలిపారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటి వరకు సేకరించిన భూమి వివరాలు, ఇంకా సేకరించాల్సిన భూమి ఎంత? సేకరించిన భూములకు సంబంధించి ఏమైనా వివాదాలు ఉన్నాయా అని ఈడి జిల్లా ఉన్నతాధికారులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడి నిఖిల్ చక్రవర్తి తో పాటు సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్, జీడిమెట్ల జోనల్ మేనేజర్ అనురాధా, టీజిఐఐసి డిజిఎం లు రామ్ దేవ్ , నాగరాజు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలు భక్తుల తాకిడి





కాళేశ్వరం మే17 (సమయం న్యూస్) : సరస్వతి పుష్కరాల నేపథ్యంలో మూడో రోజున కాళేశ్వరానికి భక్తుల రద్దీ తీవ్రంగా పెరిగింది. వీకెండ్స్ కావడంతో వాహనాల్లో భారీగా భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు. దీంతో మహదేవపూర్, కాళేశ్వరం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలను క్రమబద్ధీకరించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ లు బైకుపై తిరుగుతూ వాహనాలను పంపించే పనిలో నిమగ్నం అయ్యారు శనివారం వేకువ జాము నుండే పెద్ద సంఖ్యలో వాహనాలు కాళేశ్వరం చేరుకుంటున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులు రావడంతో పుష్కర ఘాట్ తో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతులను పునరుద్ధరించే పనిలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేలు నిమగ్నం అయ్యారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా యుద్ద ప్రాతిపదికన పనులు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ అధికారులు తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరా అందించారు. అర్ధరాత్రి వచ్చిన ఈదురు గాలుల కారణంగా టెంట్లు నేలకూలిపోగా వాటిని సవరించే పనులను అర్ధరాత్రి నుండి ప్రత్యక్షంగా కలెక్టర్, ఎస్పీలు హాజరయ్యారు. ఈ క్రమంలోనే కాళేశ్వరం రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయన్న సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు ఇద్దరు తమ కాన్వాయిలను పక్కన పెట్టి బైకుపై తిరుగుతూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టించారు. శని, ఆది వారాల్లో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుందని అంచనా వేసి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.



## నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ను కలిసిన బోధన్ నియోజకవర్గ బిజెపి నాయకులు

బోధన్. 17 మే.సమయం న్యూస్ : ఈరోజు ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ని హైదరాబాదులోని వారి నివాసంలో బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నూతనంగా ఎన్నికైన బిజెపి మండల అధ్యక్షులు అందరం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం వారితో బోధన్ లోని ప్రస్తుత తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరిగింది. భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గంలోని బీజేప పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రతి మండల అధ్యక్షుడు కృషి చేయాలని గౌరవ ఎంపీ గారు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి , పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ , బోధన్ రూరల్ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్ ,సాలూర మండల అధ్యక్షులు రావుబ గంగాధర్ , నవిపేట మండల అధ్యక్షులు ధ్యాగ సరీన్ , ఎడపల్లి మండల అధ్యక్షులు కోలా ఇంద్రకరణ్ , రెంజల్ మండల అధ్యక్షులు క్యాతం యోగేష్ ,బీజేపీ నాయకులు సంగ్రామ్ పటేల్ పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

* **భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలి**
* **ఆదివారం భక్తులు ఎక్కువ సంఖ్య వచ్చే అవకాశం**

కాళేశ్వరం మే17(సమయం న్యూస్) : సరస్వతి పుష్కరాలు సందర్భంగా ఆదివారం ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో శనివారం వాహనాలు రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని అలాంటి సమస్య రాకుండా పకడ్బందీగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించుట వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం జరిపి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. శనివారం భక్తులు రద్దీ పెరిగి ట్రాఫిక్ జామ్ అయిన సందర్భంగా ఆదివారం ట్రాఫిక్ సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెల్లవారుజాము నుండే భక్తులు వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి.కేటాయించిన విధుల్లో నిమగ్నం కావాలని స్పష్టం చేశారు.



## మాచర్ల సతీశ్ కుటుంబానికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం చేయూత

తోగుట. మే 17 ( సమయం న్యూస్) : మండల కేంద్రంలో తోగుట గ్రామంలో ఇటీవల మరణించినటువంటి మాచర్ల సతీష్ తండ్రి యాదగిరి కుటుంబానికి తొగుట నాయి బ్రాహ్మణ సేవ సంఘం తరపున 50 కిలోల బియ్యం మరియు 1100 రూపాయలు ఆర్థిక సహాయంగా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది.ఆ కుటుంబానికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఎప్పుడు వెన్నంటి ఉంటుందని వారికి మనో ధైర్యంతో ముందుకు సాగాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం తోగుట మండల అధ్యక్షుడు పయ్యావుల శ్రీనివాస్ తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో తొగుట గ్రామ అధ్యక్షులు పయ్యావుల కరుణాకర్. సిద్దిపేట జిల్లా సహాయ ప్రధాన కార్యదర్శులు దుర్వాస హరీష్ పయ్యావుల సాయికిరణ్.తొగుట గ్రామ నాయి బ్రాహ్మణులు అనిల్ శంకర్ రాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పై అవగాహన సదస్సు





బోధన్ పట్టణం, మే 17, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల మరియు కళాశాలల బస్సుల ఫిట్‌నెస్, రోడ్డు భద్రత అంశాలపై శనివారం ఇందుర్ పాఠశాలలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ప్రైవేట్ విద్యా సంస్థల అసోసియేషన్ తరపున ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం తమ బస్సుల యొక్క సాంకేతిక స్థితి, డ్రైవర్ల నడవడిక, రోడ్డు భద్రతా నియమాలపై ఖచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి బస్సు డ్రైవర్ బస్సును నడిపే ముందు బ్రేక్ వ్యవస్థను, ఇతర ముఖ్యమైన అంశాలను తనిఖీ చేయాలని, సమస్యలు ఉంటే వాటిని యాజమాన్యానికి తెలియజేసి మరమ్మతులు చేయించుకోవాలని తెలియచేస్తూ, డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ లేదా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థుల రక్షణపై తల్లిదండ్రుల నమ్మకాన్ని గౌరవిస్తూ, విద్యా సంస్థలు మరియు బస్సు డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ విద్యార్థులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచించి, బస్సు ఫిట్నెస్, రోడ్డు భద్రతా నియమాలు గురించి తదితర సంబంధిత వివరాల కరపత్రాల, వాహన పత్రాలను ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన. ఈ సదస్సులో అగ్నిప్రమాదాల నివారణపై కూడా ప్రత్యేకంగా అవగాహన కల్పించబడింది. ప్రొజెక్టర్ ద్వారా విద్యా సంస్థల్లో తీసుకోవలసిన భద్రతా చర్యలు, బస్సుల్లో అగ్నిప్రమాదాల పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని జిల్లా ట్రస్మా సభ్యులు నిర్వహించినందుకు అందరినీ ఏకం చేసినందుకు రవాణా సంస్థ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిధులకు ట్రస్మా తరుపున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, అగ్నిమాపక శాఖ ఇన్స్పెక్టర్ సుభాష్, ఎంఈఓ నాగయ్య, ట్రస్మా కమిటీ సభ్యులు, వివిధ పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన ఆడపడుచు వివాహానికి పుస్తె మట్టెలు అందజేసిన పబ్బ మహేష్ గుప్తా !!

శివంపేట్ మే 17 (సమయం న్యూస్) : భీమ్లా తండా గ్రామపంచాయతీ పరిధిలోని తౌర్య తండా లో జరుపూల పంతు పద్మ దంపతుల కూతురి వివాహానికి శివంపేట్ తాజా మాజీ జెడ్పిటిసి , ప్రముఖ సంఘ సేవకులు పబ్బ మహేష్ గుప్తా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణారావు ఆధ్వర్యంలో తండావాసుల సమక్షంలో పుస్తె మట్టెలు అందజేశారు . అడిగిన వెంటనే పుస్తె మెటల్ అందజేసిన పబ్బ మహేష్ గుప్తా గారికి జరుపుల పంతు పద్మ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ నెంబర్ జరుకుల భాస్కర్, శ్రీనివాస్ ,విజేష్ ,కిషన్, రవి విట్టల్ , కేతావత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో ఇసుక అక్రమ రవాణా పై
# జర్నలిస్టుల ఆందోళన - టిప్పర్ యజమానులపై చర్యల డిమాండ్





బోధన్ పట్టణం, మే 17, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఇటీవల జరిగిన ఘటనలో ఇసుక టిప్పర్ యజమానులు జర్నలిస్టుల దిష్టిబొమ్మలు దహనం చేసినందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనికి స్పందనగా జర్నలిస్టులు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణకు కూడా ఫిర్యాదు పత్రం అందజేశారు. గతంలో మంజీర నదిలోని ఖండ్ గాం, సిద్ధాపూర్ ఇసుక క్వారీలపై అక్రమ తవ్వకాలపై వార్తలు ప్రచురితమవగా, అధికారులు తాత్కాలికంగా క్వారీని మూసివేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా మాజీ అధ్యక్షులు తేళ్ళ రవి కుమార్ మాట్లాడుతూ 40గా జర్నలిస్టు కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్ట్ నమస్తే తెలంగాణ డివిజన్ స్టాఫ్ రిపోర్టర్ ఎస్. బలరామరాజు, 15 సంవత్సరాలుగా టి న్యూస్ రిపోర్టర్ పనిచేస్తున్న తారాచంద్ ల దిష్టిబొమ్మలు దగ్ధం చేయడాన్ని జర్నలిస్టులు పత్రికా స్వేచ్ఛకు విఘాతంగా అభివర్ణించారు. బలరామరాజు పై అసత్య నిరాధార ఆరోపణలు చేసి దిష్టిబొమ్మ దగ్ధం చేయడం హేయమైన చర్య, నిబంధనలకు పాత్ర వేసి ఇసుకను ఓవర్ లోడ్ తో అక్రమ రవాణా పాల్పడుతున్న టిప్పర్ యజమానులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ టిప్పర్ యజమానులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా మాజీ అధ్యక్షుడు తేళ్ళ రవికుమార్, మాజీ కార్యదర్శి శ్రీనివాస్, గడ్డం గంగులు, ఖుర్షిద్, బండారి సాయిలు, రాజులాల్, లింబూరి లక్ష్మణ్, ఉమాకాంత్ సాంబశివరావు, నల్వాల కృష్ణ, గోపి, నరహరి, రమేష్, కారం స్వామి, జగన్, రాజేష్, కడికే శివ, అబ్బయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టులు హెచ్చరిస్తూ, ఇలాంటి చర్యలు మళ్లీ జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టం చేశారు.




## మన ఊరి బడిలోనే పిల్లలను చదివిద్దాం

* **పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం**

జిన్నారం, మే 17, సమయం న్యూస్ : మన ఊరి మనబడి లోని పిల్లలను చదివిద్దామని ఇప్పుడు కంచి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం అన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లల్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని, పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు .ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచితంగా దుస్తులను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.మన పాఠశాలలో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యా బోధన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొగులయ్య, విద్యార్థులు తల్లిదండ్రులు శ్రీనివాస్, మచ్చేందర్, గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో మీడియా మిత్రులపై ఇసుకాసురుల దాడిని ఖండిస్తూ..
# మీడియాకి అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ

బోధన్ పట్టణం, మే 17, సమయం న్యూస్ : బోధన్ పట్టణంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ నేతృత్వంలో తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించ బడింది. ఖండ్గావ్, సిద్దాపూర్‌లో జరిగిన ఇసుక మాఫియాను మీడియా వెలుగులోకి తీసుకురావడంతో, కొందరు అక్రమ ఇసుకాసురులు మీడియా మిత్రుల దిష్టిబొమ్మను దగ్ధం చేసి, అసభ్యకరంగా వ్యవహరించారు. ఈ చర్యలను బీఆర్ఎస్ పార్టీ బోధన్ పట్టణ శాఖ తీవ్రంగా ఖండించింది. మీడియా మిత్రులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఇలాంటి దాడులు తిరగదిద్దాల్సిన అవసరం ఉందని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ హేయమైన చర్య పై, ఇసుక మాఫియా పై సబ్ కలెక్టర్, ఏసిపి చర్యలు తీసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ ఘటనపై వెంటనే తగు సమగ్ర విచారణ చేపట్టి అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని పార్టీ కోరింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ రజాక్, మాజీ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, రేఖందాసు, ప్రవీణ్ జాదవ్, షేక్ జాకీర్ అహ్మద్, సాగర్, షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.





## వెంకట్రావుపేటలో బడిబాట కార్యక్రమం

తోగుట. మే 17 (సమయం న్యూస్) : మండలం లోని వెంకట్రావు పేట గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలిగామ వెంకటయ్య మరియు హై స్కూల్ ఉపాధ్యాయులు డి నర్సయ్య లు ప్రాథమిక పాఠశాల ఆవరణ లో నిరక్షరాస్యులు అందరు అక్షరాస్యులుగా నమోదు కావాలని తమకు సమయం కుదిరినప్పుడు తప్పకుండా చదువు నేర్చుకోవాలని డ్వాక్రా సంఘాల మహిళలకు సూచించడం జరిగింది. ప్రతి ఒక్కరు అక్షరాస్యులుగా ఉండాలి అని భారత ప్రభుత్వం UL LAS అనే గొప్ప కార్యక్రమం తో గ్రామాల్లో అందరికీ విద్యా మనందరి బాధ్యత అని పిల్లలు కూడా చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి వారికి మళ్ళీ చదువు చెప్పి ప్రభుత్వం సర్టిఫికెట్ కూడా అందించడానికి ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది గ్రామం లోని యువకులు చెప్పడానికి ఆసక్తి ఉన్నవాళ్ళతో తమ అందరికీ చెప్పేలా సదుపాయాలు కల్పిస్తామని తప్పకుండా మీరు అందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని ప్రతి ఒక్కరు అక్షరాస్యులుగా మారాలి అని తెలిజేశారు. కార్యక్రమం లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వి. శ్రీధర్, హై స్కూల్ ఉపాధ్యాయులు M. ఎల్లయ్య,CRP బి. శ్రీనివాస్ , కారోబార్ కనకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్, వెలుగు CC వరలక్ష్మి, CA సుధా మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పత్రికా సోదరుల దిష్టిబొమ్మల దహనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ..
# మీడియాకి అండగా నిలిచిన బీజేపీ నాయకులు

బోధన్ పట్టణం, మే 17, సమయం న్యూస్ : బోధన్ నియోజకవర్గంలో ఇసుక మాఫియాను నిర్భయంగా ప్రచురణ, ప్రసరణ చేస్తున్న పత్రికా సోదరులపై దాడులు, వీరి దిష్టిబొమ్మలను దహనం చేయడం హేయమైన చర్య అని మీడియా ముఖంగా బీజేపీ తీవ్రంగా ఖండించింది. స్వేచ్ఛా ప్రెస్‌పై దాడులు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని పేర్కొంది. ఈ విధంగా మీడియాపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదని, దీనిని మేము తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ బోధన్ నియోజకవర్గ



నాయకులు మీడియా ప్రతినిధులపట్ల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్ , మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ధ్యాగ సరీన్, రావుబా గంగాధర్, కోలా ఇంద్రకరణ్, క్యాతం యోగేష్ పాల్గొన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడేందుకు బీజేపీ సన్నద్ధంగా నిలుస్తుందని నాయకులు తెలిపారు. బోధన్‌లో జరుగుతున్న ఇసుక అక్రమాలపై రిపోర్టు చేసిన విలేకరులపై దాడులను తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశారు.



## బోధన్‌లో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 4 మొబైల్ ఫోన్లు రికవరీ

* **యజమానులకు అప్పగింపు**

బోధన్ పట్టణం, మే 17 సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్ విభాగం మరోసారి తమ నిబద్ధతను నిరూపించింది. బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న నాలుగు మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్యుప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా సాంకేతికంగా గుర్తించి, వాటిని యజమానులకు తిరిగి అప్పగించారు. ఈ మొబైల్ ఫోన్లను 2025 మే 17 శనివారం రోజున బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంబంధిత యజమానులకు అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ వెంకటనారాయణ మాట్లాడుతూ, "సీ ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్స్‌ను పునఃప్రాప్తి చేయడం సులభం అయిందని, ప్రజలు తమ మొబైల్ పోయినపుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు." పోలీసు శాఖ ఈ సేవను ప్రజల మద్దతుతో మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం

– **సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన**





బోధన్ మండలం, మే 17, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో "రైతు వేదిక"లో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అనే ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రుద్రూర్ వ్యవసాయ పరిశోధన సంస్థ సైంటిస్ట్ సహనా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, రైతులు సేంద్రీయ జీవన ఎరువులను వాడాలని, వంట మాలిన్యాలు, పశువుల ఎరువు, కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. రసాయన పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి పంటల వ్యాధినిరోధక శక్తిని పెంపొందించేందుకు భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు మేలు తీరని వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ సంతోష్, వెటర్నరీ డాక్టర్లు నాగభూషణ్ మరియు సంతోష్, పిఎసిఎస్ చైర్మన్ రాజిరెడ్డి, ఏఈఓ సరోజ లక్ష్మి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి గంగాధర్, తదితర అధికారులు పాల్గొన్నారు. రైతులు పోతారెడ్డి, మేడి రవి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, ఎర్రపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గౌరాజి, రమణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సంజీవ్, వెంకటస్వామి, పోసుగొండ మాణిక్యం, పోశెట్టి, సాయిలు తదితరులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు వినిపించారు. సేంద్రీయ వ్యవసాయం, పంటల ఆరోగ్యం, మరియు వ్యాధినిరోధక శక్తి పెంపు వంటి అంశాలపై చక్కటి అవగాహన ఏర్పడింది.

# అమెరికాలో తుపానుల బీభత్సం.. 21 మంది మృతి!

అమెరికా (USA)లో తుపానుల కారణంగా విపత్కర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా కెంటకీ, మిస్సోరీల్లో టోర్నడోలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రకృతి ప్రకోపానికి 21 మంది మృతి చెందారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో కెంటకీలో 14 మంది, మిస్సోరీలో ఏడుగురు ఉన్నారు. కెంటకీలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గవర్నర్ ఆండీ బేషియర్ తెలిపారు. కెంటకీలోని లారెల్ కౌంటీలో టోర్నడో బీభత్సానికి తొమ్మిది మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. అనేక మందికి గాయాలయ్యాయని, ఆస్తినష్టం కూడా నమోదైందని చెప్పారు. మిస్సోరీలో ఐదువేల భవనాలు ధ్వంసమయ్యాయి. ఇక్కడి సెయింట్ లూయిాలో ఐదుగురు మృతి చెందారు. దాదాపు లక్ష నివాసాలకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇల్లినోయిాలోనూ టోర్నడోలు విరుచుకుపడుతున్నట్లు యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది.







# వివిధ పుణ్యస్థలాల నుండి తెచ్చిన పవిత్రమైన జలాలతో శ్రీ గురు పీఠంలో జలాధివాసం!!!

శివంపేట్ మే 17( సమయం న్యూస్) : శివంపేట్ మండలం గూడూరు గ్రామం శ్రీ గురు పీఠంలో జూన్ 3 నా జరిగే శ్రీ గణేశ సహిత శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శ్రీ శ్రీపాద వల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్య ప్రభు, శ్రీ అక్కలకోట స్వామి సమర్థ, శ్రీ సాయినాథ మహారాజ్ వారికి జులాదివాసం జరపడానికి కాకినాడ యానం నుంచి సముద్ర జలాలను,మానస సరోవరం నుంచి తెచ్చిన జలాలు, మంత్రాలయం నుంచి తుంగభద్ర జలాలను, బీచుపల్లి నుంచి కృష్ణా నది జలాలను, బాసర నుంచి గోదావరి జలాలను, కుంభమేళాలనుంచి తెచ్చిన మహా కుంభమేళా పరమ పవిత్రమైన జలాలతో జలాధివాసము నిర్వహించబడును, అరుదైన అతి పవిత్రమైన జలాలను



తలపై చల్లుకుంటే సర్వదోషాలు హరిస్తాయి, కావున భక్తులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని పునీతులు అవుతారని ఆ దివ్య గురు మూర్తుల కరుణ మీ పై వర్షిస్తుందని సవినయంగా మనవి చేస్తున్నామని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ తెలియజేశారు .

# పాక్‌కు గూఢచర్యం చేస్తోన్న యూట్యూబర్ అరెస్ట్.. ఎవరా జ్యోతి మల్హోత్రా..?

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమా చారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హరియాణాలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని శనివారం వెల్లడించారు. వీరంతా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు చెందినవారితో తరచూ సంప్రదింపులు జరుపుతున్నారని, శత్రుదేశానికి సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు. ఆ ఆరుగురిని హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. హిస్సార్ ప్రాంతం నుంచి అరెస్టయిన మహిళా యూట్యూబర్ పేరు జ్యోతి మల్హోత్రా అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం న్యాయస్థానం ఆమెకు ఐదురోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఆమె ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. ట్రావెల్ విత్ జో పేరిట ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నారు. ఆమె పాక్‌లో పలుమార్లు పర్యటించారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పాక్ వ్యక్తులతో దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు ఆరోపించారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తనను కూడా ఎంపిక చేశారని, అప్పుడు అహ్సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిశానని విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. భారత్‌కు వచ్చిన తర్వాత అతడితో సంప్రదింపులు కొనసాగించింది. అహ్సాన్ సూచన మేరకు ఆమె..





అలీ అహ్సాన్ అనే వ్యక్తిని కలుసుకుంది. పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను ఆమెకు అతడు పరిచయం చేశాడని సమాచారం. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా.. అరెస్టయిన వారిలో పటియాలలోని ఖల్సా కళాశాలలో చదువుతోన్న దేవేంద్ర సింగ్ ధిల్లాన్ కూడా ఉన్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్ట జెప్పి నట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడని తెలుస్తోంది.



# మామిడి పండ్ల ప్రదర్శన ను సందర్శించిన జిల్లా కలెక్టర్

*** క్రాంతి వల్లూరు.**

సంగారెడ్డి మే 17( సమయం న్యూస్) : శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ,సంగారెడ్డి లోని ఫల పరిశోధన స్థానంలో రెండు రోజులుగా మామిడి రకాల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది .ఈరోజు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి గారు ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేసి 280 రకాల మామిడి పండ్లను వీక్షించారు. కలెక్టర్ గారు మాట్లాడుతూ జిల్లాలో ఇంత మంచి పండ్ల పరిశోధన స్థానం ఉండడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం ఇంకా మరెన్నో పరిశోధనలు చేసి మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గారు సైంటిస్టులకు సూచించారు ,అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి గారు యూనివర్సిటీలో చదువుతున్న ఎంఎస్సీ ,పిహెచ్డి విద్యార్థులతో కోర్సుకి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో ఫల పరిశోధన స్థానం హెడ్ సుచిత్ర గారు సైంటిస్ట్ హరికాంత్ గారు నితీష్ గారు హార్టికల్చర్ విద్యార్థులు , ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రైతులు ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

# ముంబయి విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ సభ్యుల అరెస్టు

పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది. తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అను మానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండో నేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను NIA ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలి స్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్‌పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు.

# జుట్టు ఆరోగ్యానికి మునగాకు లడ్డూ..!

**మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లు, కాలుష్యం కారణంగా చాలామంది మహిళలు.. జుట్టు రాలడం, గోళ్లు పొడిబారడం.. వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఆరోగ్యపరమైన, జన్యుపరమైన కారణాల వల్ల కూడా ఈ సమస్యలతో బాధపడుతుంటారు. అయితే ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పదార్థాలతోనే చెక్ పెట్టొచ్చంటున్నారు పోషకాహార నిపుణులు. ఈ క్రమంలో- మునగాకుతో చేసిన లడ్డూ తినడం వల్ల జుట్టు రాలే సమస్యను తగ్గించవచ్చంటున్నారు. ఇది జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు.**



**కావాల్సిన పదార్థాలు:**

* గుమ్మడి గింజలు 1/3 కప్పు
* పిస్తా గింజలు 1/3 కప్పు
* కొబ్బరి పొడి 2/3 కప్పు
* మునగాకు పొడి 2 టేబుల్ స్పూన్లు
* యాలకులు మూడు
* కిస్‌మిస్ 3/4 కప్పు



**తయారీ:**

ముందుగా ఒక కడాయి తీసుకుని అందులో కొబ్బరి పొడి, పిస్తా గింజలు, గుమ్మడి గింజలు వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత కిస్‌మిస్‌ని కూడా దోరగా వేయించాలి. వీటన్నింటిని మిక్సీ బౌల్‌లోకి తీసుకుని మునగాకు పొడి, యాలకులను జత చేసి మిక్సీ పట్టుకోవాలి. వచ్చిన మిశ్రమాన్ని ఉండల్లా చేసుకుంటే లడ్డూలు రడీ.

* ఈ లడ్డూని రోజుకు ఒకటి చొప్పున తీసుకోవాలి.

**ప్రయోజనాలు**

* కొబ్బరి పొడిలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి జుట్టు, గోళ్లకు పోషణ అందిస్తాయి.
* పిస్తాలో బయోటిన్, విటమిన్‌ఈతో పాటు ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ ఆమ్లాలు మెండుగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను దృఢంగా చేసి, పెరుగుదలను ప్రేరేపించడంలో సహాయపడతాయి.
* కిస్‌మిస్‌లో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.
* మునగాకుల్లో విటమిన్ ఎ, సి, విటమిన్ బి కాంప్లెక్స్, అమైనో యాసిడ్స్, ఐరన్, జింక్, క్యాల్షియం, కాపర్, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీసు, సిలికా, ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ ఆమ్లాలు ఉంటాయి. ఇవి చర్మం, జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయి.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం



## కోల్‌కతా ఆశలపై నీళ్లు..

# బెంగళూరుతో మ్యాచ్ వర్షార్పణం

బెంగళూరు: తొమ్మిది రోజుల తర్వాత ఐపీఎల్ 2025 పునఃప్రారంభం కావడంతో మళ్లీ ధనాధన్ వినోదాన్ని ఆస్వాదిద్దామనుకున్న అభిమానులకు నిరాశే ఎదురైంది. శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణం అయింది. కనీసం టాస్ కూడా పడకుండానే మ్యాచ్ రద్దయింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉన్నట్లు వాతావరణ శాఖ ముందే అంచనా వేయగా.. అందుకు తగ్గట్టుగానే సాయంత్రం నుంచి వర్షం మొదలైంది. తొలుత చిన్నపాటి జల్లుగా మొదలై క్రమంగా జోరందుకుంది. తర్వాత వరుణుడు కొద్దిసేపు శాంతించడంతో మ్యాచ్ నిర్వహణకు



వీలుగా మైదానాన్ని సిద్ధం చేయడానికి సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే, కాసేపటికే మళ్లీ వాన మొదలైంది. వర్షం తగ్గితే కనీసం 5 ఓవర్ల మ్యాచ్‌నైనా నిర్వహించాలని చూశారు. కానీ, ఎడతెరిపి లేకుండా వాన కురువడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

*** కోల్‌కతా ఔట్**

ఈ మ్యాచ్‌లో గెలిచి ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలనుకున్న కోల్‌కతా ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. మ్యాచ్ రద్దవడంతో ఆ జట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ప్రస్తుతం కేకేఆర్ 13 మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో ఉంది. చివరి లీగ్ మ్యాచ్‌లో (హైదరాబాద్‌తో) గెలిచినా కోల్‌కతాకు పెద్దగా ప్రయోజనం ఉండదు. ఇక, కేకేఆర్‌పై గెలిచి అధికారికంగా ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుందామనుకున్న ఆర్సీబీకి నిరాశే ఎదురైంది. అయితే, 12 మ్యాచ్‌లు ఆడి 17 పాయింట్లతో ఉన్న బెంగళూరు.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఓడినా ప్లే ఆఫ్స్‌కు చేరేందుకు ఛాన్స్ ఉంటుంది.

## ఐపీఎల్ పునఃప్రారంభానికి పొంచి ఉన్న వాన ముప్పు!

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్ వాయిదా పడిన విషయం తెలిసిందే. పఠాన్ కోట్, జమ్ములో పాకిస్థాన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో... మే 8న ధర్మశాలలో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో.. తొమ్మిది రోజుల అనంతరం ఇండియన్ ప్రీమియర్ లీగ్ పునఃప్రారంభం కానుంది. రాత్రి 7:30లకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆర్సీబీ, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌కు వరుణుడి నుంచి ముప్పు పొంచి ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వర్షం కారణంగా ఆట మొత్తం తుడిచిపెట్టుకునిపోయే ప్రమాదమూ ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నస్వామి స్టేడియంలో అత్యుత్తమ డ్రైనేజీ వ్యవస్థ ఉండటం కాస్త ఊరట కలిగించే అంశం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటివరకు తాను ఆడిన 11 మ్యాచుల్లో 8 విజయాలు సాధించింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ 12 మ్యాచుల్లో అయిదింట్లో విజయం సాధించి, ఆరో స్థానంలో ఉంది.

# సినిమా



## రెడ్ సీ ఫెస్టివల్‌లో జాక్వెలిన్!

జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఫ్రాన్స్ లో జరుగుతున్న 78వ కాన్స్ చిత్రోత్సవాల్లో ఆమె 'రెడ్ సీ ఫెస్టివల్'లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించింది. మహిళా నిర్మాతలు, నటులు, సాంకేతిక విభాగంలో ఉన్నవారు సినిమాలకు చేసిన కృషిని ప్రస్తావించే 'ఉమెన్ ఇన్ సినిమా' గాలాలో పాల్గొనే గౌరవం జాక్వెలిన్‌కి దక్కింది. గత ఏడాది గ్రాండ్ ప్రీ అవార్డు గెలుచుకున్న 'ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ లైట్'లో నటించిన ఛాయా కదమ్ ఆ 77వ చిత్రోత్సవాల్లో సందడి చేశారు. ఈ ఏడాదీ ఆమె కాన్స్ వెళ్లారు. ఇంకా భారతదేశం నుంచి డిజిటల్ కంటెంట్ క్రియేటర్ మాసూమ్ మీనావాలా, ఇండియన్-థాయ్ బ్యూటీ, 'మిస్ యూనివర్స్ థాయ్‌ల్యాండ్ సరాబురి' వీణా ప్రవీణర్ సింగ్, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ సాక్షి సింద్వానీ పాల్గొన్నారు. 'తన్వీ ది గ్రేట్' స్క్రీనింగ్ కోసం హాజరైన ఆ చిత్రదర్శకుడు అనుపమ్ ఖేర్ కూడా రెడ్ కార్పెట్‌పై స్టైలిష్‌గా కనిపించారు.

## అతడి చెంపపై కొట్టిన



డెయిరీ మిల్క్ కమర్షియల్ యాడ్‌తో పాపులర్ అయిన బాలీవుడ్ నటి నిమ్రత్ కౌర్. వరుసగా రెండు సినిమాలు కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడి ఆమె నటనకూ మంచి మార్కులు పడ్డాయి. ఆతర్వాత హిందీలో రెండు, మూడు అమెరికన్ టీవీ సిరీస్‌లలో చేసింది. 'ది లంచ్‌బాక్స్', 'దాస్వి', 'ఎయిర్‌లిఫ్ట్' వంటి చిత్రాలతోనూ అలరించింది. ఇటీవల సిటాడెల్: హనీ బన్నీ ప్రీమియర్‌లో కనిపించి ఫ్యాషన్ ప్రపంచాన్ని అలరించింది. తాజాగా ఈ అమ్మడు తన వ్యక్తిగత జీవితంలో జరిగిన కొన్ని విషయాలను ప్రేక్షకులతో పంచుకుంది. తాను 19 ఏండ్ల వయసులో సుప్రీంకోర్టులోనే లైంగిక వేధింపులకు గురైనట్లు చెప్పుకొచ్చింది. 'లా చదువుతున్నప్పుడు సుప్రీంకోర్టుకి వెళ్లా. కోర్టు రూమ్ అంతా లాయర్లతో నిండిపోగా, జడ్జి వాదనలు వింటున్నారు. ఇంతలో నా వెనుక ఎవరో చేయి వేశారు. తిరిగి చూడగా అతడో సీనియర్ లాయర్. పక్కకు జరిగినా మళ్లీ అలాగే చేశాడు. తొలుత ఆందోళనకు లోనైనా వెంటనే తేరుకొని అతడి చెంపపై ఒక్కటిచ్చి, అక్కడి నుంచి వెళ్లిపోయా' అని పేర్కొంది. కాగా నిమ్రత్‌తో ప్రేమాయణం కారణంగానే బాలీవుడ్ స్టార్ కపుల్ ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ విడిపోవడం ఖాయమన్న పుకార్లు గతంలో జోరుగా వ్యాపించిన సంగతి తెలిసిందే.



## రఫ్ఫాడించేద్దాం

మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో ఒక కొత్త సినిమా పట్టాలెక్కిన విషయం తెలిసిందే. #మెగా 157, #చిరు అనిల్ వర్కింగ్ టైటిల్స్. ఈమూవీని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు. కాగా ఇందులో చిరు సరసన లేడీ సూపర్ స్టార్ నయనతారను హీరోయిన్ గా ఫిక్స్ చేసారు మేకర్స్. అందుకు సంబంధించి ఓ ప్రోమోను రిలీజ్ చేసి అఫీషియల్‌గా ప్రకటించారు. వీడియో చివర్లో చిరు మేనరిజంలో 'హలో మాస్టారు.. కెమెరా కొద్దిగా రైట్ టర్నింగ్ ఇచ్చుకోమ్మా' అంటూ నయన్ చెప్పిన సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి రఫ్ఫాడించేద్దామ్ అని నయన్, అనిల్ కలిసి చెప్పిన డైలాగ్ ప్రోమోకే హైలెట్ గా నిలిచింది. కాగా.. గతంలో సైరా నరసింహారెడ్డి, గాడ్ ఫాదర్ చిత్రాలతో చిరుకు జోడిగా నటించింది నయన్. లాంగ్ గ్యాప్ తర్వాత మరోసారి మెగాస్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. మరి ఈ కాంబో ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తుందో చూడాలి.

## SOCIAL LOOK



చీరకట్టులో స్టైలిష్‌గా కనిపించింది సమంత



విహారయాత్రలో సరదగా గడుపుతోంది ఖుషీ కపూర్



కుక్కపిల్లతో ఆడుతూ అనన్య పాండే



ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంది శ్రీనిధిశెట్టి

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.